క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



యర్రంశెట్టివారిపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు, యర్రంశెట్టి భార్గవ దంపతులు ఆలయ పూజారి సూర్య కిరణ్ బ్రహ్మత్వంలో కల్యాణం, చక్రస్నానం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికం సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

నేడు రామలింగేశ్వరుని ఆలయంలో సప్త ప్రదక్షిణలు



క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేది సోమవారం సప్త సోమవారాలు, సప్త మారేడు దళములతో ప్రదక్షిణాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ప్రదోషకాల సమయంలో అంటే సాయంత్రం 5.30 గంటలకు ఈ ప్రదక్షిణలు ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మోటార్ సైకిల్ ఢీకొని వైద్యుడికి గాయాలు

భీమవరం: భీమవరం టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చినఅమిరం గ్రామ సమీపంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న డాక్టర్‌ను మరొక మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడినట్లు ఎస్సై ఇజ్రాయిల్ ఆదివారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్లకు చెందిన డాక్టర్ వలి గంగాధర్‌కుమార్ రెడ్డి కొంతకాలంగా భీమవరం పట్టణంలోని ఇంపీరియల్ ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం చిన అమిరం గ్రామం నుంచి తన మోటారు సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరొక మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇజ్రాయిల్ చెప్పారు.

వడ్రంగి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

భీమవరం: జిల్లాలో వడ్రంగి కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేయూత నందించాలని జిల్లా వండ్రంగి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిట్టిమోజు భోగేశ్వరరావు, చిప్పాడ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆదివారం భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది వడ్రంగి కార్మికులున్నారని ప్రభుత్వ పరంగా ఎటువంటి సహాయం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కమిటీ సభ్యులతో ప్రమాన స్వీకారం చేయించి జ్ఞాపికలు అందజేశారు.

ఉపాధికి ఊతమేదీ?



ఉపాధి పనులు చూపాలంటూ వెంకట్రామపురంలో వినతిపత్రం అందిస్తున్న కూలీలు (ఫైల్)

పెనుగొండ: వ్యవసాయ కార్మికులకు పనుల్లేని కాలంలో ఉపాధి పనులు చూపి వారి జీవనోపాధికి అండగా నిలవడానికి ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతుంది. సాగులో యాంత్రికరణ రావడంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి అవకాశాలు రోజు రోజుకు సన్నగిల్లుతున్నాయి. ఈ తరుణంలో జాతీయ ఉపాధి హామీ పథకంపైనే ఉపాధి కూలీలు ఆశలు పెట్టుకున్నారు. ఉపాధి పనులతో ఎంతో కొంత జీవనోపాధి లభిస్తుందని ఆశ పెట్టుకున్న ఉపాధి కూలీలకు నిరాశే మిగులుతుంది. దీని కోసం భారీగానే జాబ్ ఖార్డులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. పెనుగొండ మండలంలో 8,452 జాబ్ కార్డు ఉండగా, 12873 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. జాబ్ కార్డులు 6.077 యాక్టివ్‌గా ఉండగా,8,799 మంది ఉపాధి కూలీలు పనులు చేసుకోవడానికి



కొఠాలపర్రులో ఇటీవల ప్రారంభించిన ఉపాధి పనులు (ఫైల్)

సిద్ధంగా ఉన్నారు. అయితే, వీరికి ఉపాధి పనులు చూపడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

నిబంధనలతో ఇబ్బంది

ఉపాధి పనులు చూపించడానికి నిబంధనలు అడ్డురావడం, కొన్ని గ్రామాల్లో పనులు గుర్తించి, చేయించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కొరత కొట్టుమిట్టాడుతుండడంతో ఉపాధి కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పూర్తి స్థాయిలో ఉపాధి పనులు చూపలేకపోయారు. వెంకట్రామపురం గ్రామంలో కనీసం ఒక రోజు పని సైతం కల్పించలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ బుంగా గణేష్ కల్పించుకోవడంతో కొంత మేర పనులు మొదలుపెట్టారు. పెనుగొండ, సిద్ధాంతంల్లో అయితే కేవలం రెండు వారాలు మాత్రమే పని దినాలు చూపించగలిగారు, ములపర్రు, మునమర్రు, తామరాడల్లో పనులు గుర్తించి, చేయించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనులు సక్రమంగా జరిగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పథక లక్ష్యానికి తూట్లు పడి, ఉపాధి కూలీలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి పనులు చూపాలంటూ ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల వినతి పత్రాలు సైతం సమర్పించారు. ఇప్పటికైన ఎన్ఆర్ఈ జీఎస్ పథక లక్ష్యాలు నెరవేర్చడానికి పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధి పనులు చూపాలి



ఉపాధి కూలీలకు పనిదినాలు చూపాలి. ఉపాధి పనులు చూపించ పోవడంతో ఉపాధి కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు నియామకం చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడంతో ఉపాధి కూలీలు తీవ్రంగా నష్ట పోతున్నారు. అధికారులు స్పందించి ఉపాధికి చేయూతనివ్వాలి.

– షేక్‌పాదుషా, కార్యదర్శి వ్యవసాయ కార్మిక సంఘం

నిరుపయోగంగా బస్ షెల్టర్లు



పెనుమంట్ర రోడ్డులో బస్‌షెల్టర్‌లో బెంచీలు లేక దుమ్ముతో నిండిన మెట్లమీదే కూర్చున్న ప్రయాణికులు, పక్కనే అడ్డంగా పెట్టిన ఆటోలు, మోటరు సైకిళ్లు

పెనుమంట్ర: ప్రధాన సెంటర్‌లలో దాతలు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాతల ఆశయ స్ఫూర్తికి విఘాతంగా మారుతున్నాయి. అందుకు నిదర్శనం మార్టేరు సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్లు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో గ్రామ పంచాయతీ కోడేరు రోడ్డులోనూ, పాలకొల్లు, పెనుగొండ, పెనుమంట్ర రోడ్లలో భారతీయ విద్యాభవన్స్ దాతృత్వంతో నిర్మించిన బస్ షెల్టర్లు నేడు ప్రయాణికులకు అసౌకర్యాలకు నిలయంగా మారాయి. కోడేరు– పాలకొల్లు రోడ్డులో బష్‌షెల్టర్‌లను అన్ని అధునాతన సౌకర్యాలతో పూర్తిచేసి, ప్రారంభించినప్పటికీ పెనుమంట్ర, పెనుగొండ రోడ్డులో ఉన్న బస్ షెల్టర్‌లు దాదాపు పూర్తికావొచ్చినప్పటికీ ఎన్నికలు కారణంగా ఆ బస్సు షెల్టర్‌లో కుర్చీలు మాత్రమే ఏర్పాటు చేశారు మిగిలిన పనులు నిలిచిపోయి అసంపూర్తిగా ఉన్నాయి.

ఫొటోలకే పరిమితం

కూటమి ప్రభుత్వం రాగానే పాలకొల్లు రోడ్డులో ఉన్నబస్ షెల్టర్‌పై కూటమి నాయకుల అధునాతన చిత్రపటాలతో తీర్చిదిద్దారే తప్ప అక్కడ ప్రయాణికులకు అసౌకర్యంగా ఉన్న విషయాలను అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో బస్ షెల్టర్‌లో అధునాతన బెంచీలపై మందుబాబులు నిద్రించడమే కాకుండా బస్ షెల్టర్‌కు ఉన్న పబ్లిసిటీ బోర్డులకు వివిధ మతాలు, ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు ఆసుపత్రుల వాల్‌పోస్టర్‌లతో అధ్వానంగా మారాయి. బస్సులు ఆగాల్సిన ప్రదేశాల్లో ఆటోలు, పార్కింగ్ చేయడం బస్‌స్టేషన్ పక్కనే మొబైల్ హోటల్స్ ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో ప్రయాణికులు బస్‌స్టేషన్ బయటే నిలబడి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంటుండగా బస్‌స్టేషన్‌లో ఆటోలు, మోటరు సైకిళ్ల పార్కింగ్‌చేసి ఉంచడం వల్ల బస్సులను మెయిన్ రోడ్డులనే నిలపడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సు షెల్టర్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



పెనుమంట్ర వైపు బస్‌షెల్టర్‌లో ప్రైవేటు సంస్థలు అంటించిన వాల్ పోస్టర్‌లు

ఎన్ఎంఎంఎస్‌లో చిట్టవరం విద్యార్థుల ప్రతిభ

నరసాపురం రూరల్: జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో మండలంలోని చిట్టవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు గుబ్బల వెంకటస్వామి, పాత్తూరి శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన పాఠశాలకు చెందిన శీలబోయిన జ్యోష్ణవి, ఏలూరి అను, గొల్లమందులు అక్షిత, ఇంజేటి యేసురాజు, ఇబ్బా దుర్గాదేవి తదితరులను ఆదివారం ఆయన అభినందించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున 4 సంవత్సరాలకు రూ.48 వేలు నగదును కేంద్ర ప్రభుత్వం ద్వారా స్కాలర్ షిప్ కింద అందిస్తుందన్నారు. విద్యార్థులను విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం

యలమంచిలి: మండలంలోని కొంతేరు శ్రీకుంతీ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి రథోత్సవం సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పుల మధ్య అత్యంత వైభవంగా సాగింది. రాత్రి ఆలయంలో సదస్యం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ మల్లుల రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డాల సత్యనారాయణ, గ్రామ పెద్దలు మంచెం పుల్లారావు, అందే వీర రాఘవులు, వర్ధినీడి మణికంఠ, అడ్డాల రామకృష్ణ, తోలేటి భీమేశ్వరరావు, మంచెం సుబ్బారావు, మంచెం సత్యనారాయణ, తిరుక్కువల్లూరి గోవర్ధన్ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమంలో ప్రారంభం అవుతుందని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.

ఘనంగా అన్నసమారాధన

నరసాపురం: హనుమద్ జయంతి ముగింపు వేడుక సందర్భంగా పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 3 వేల మంది అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు పర్యవేక్షించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుగొండ: నడిపూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో నడిపూడికి చెందిన పుల్ల శ్రీను ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై మధుబాబు, కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

నరసాపురం రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తుతో పోటెత్తింది. అమ్మవారి జాతర సోమవారం జరుగుతుండడంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆదివారం తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీతో నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, దేవాదాయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వృద్ధులకు ఇంటింటికీ వైద్యం

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమంలో భాగంగా సీనియర్ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వృద్ధులకు వైద్య సేవలు అందించారు. తణుకు, ఉండ్రాజవరం ప్రాంతాల్లో ప్రత్యేక వాహనంలో పర్యటించి ఐదుగురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు కె.రామమోహనరావు సౌజన్యంతో ఉచితంగా మందులు అందచేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబరకు ఫోన్ చేయాలని కోరారు.

ముత్యాలమ్మా.. కరుణించమ్మా



బండి ముత్యాలమ్మ వారి అఖండ జ్యోతి



విద్యుత్ దీపాలంకరణలో సాయిబాబా

వైభవంగా ముత్యాలమ్మ జాతర

నరసాపురం రూరల్: ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ... భక్తుల కోర్కెలు తీర్చే తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారు ప్రసిద్ధి చెందారు. తాడిచెట్టు చుట్టూ నిర్మించిన ప్రాకారమే అమ్మవారి ఆలయంగా బాసిల్లుతుంది. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అమ్మవారి జాతర నిర్వహిస్తూ ఉంటారు. ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుండి లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. సుమారు 90 లక్షల వార్షిక ఆదాయంతో ఏ1 గేడ్ ఆలయంగా దినదినాభివృద్ధి చెందుతోంది.

తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవతగా ప్రసిద్ధి

ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారు తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదైవంగా కొలుస్తారు. తీర ప్రాంత ప్రజలు ప్రతీ శుభకార్యానికి కచ్చితంగా అమ్మవారి ఆలయంలో పెళ్లి, గృహప్రవేశాలు, ఇతర ఆహ్వాన పత్రాలు అమ్మవారి తాడిచెట్టుకింద పెట్టి పూజించి పంపిణీ చేస్తారు. అలాగే ముత్యాలపల్లి ప్రాంతంలో తమ పిల్లలకు ముత్యాలమ్మ, లేదా ముత్యాలరావు, ముత్యాలరాజు ఇలా అమ్మవారి పేరు వచ్చేలా తమ బిడ్డలకు నామకరణం చేస్తుంటారు.

మూడేళ్లకోసారి జాతర

ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రతి మూడు సంవత్సరాలకు, ఒక్కోసారి నాలుగో సంవత్సరం రాకుండా నిర్వహించడం ఆనవాయితీ. జాతర అమ్మవారిని నిలబెట్టే పూరి గుడిసే, పందిర రాడ్డులు, తోరణాలు కట్టడం, అఖండ జ్యోతి వెలిగించడం, అమ్మవారిని సాగనంపడం, మొదటి మొక్కుబడి తీర్చడం తదితర విషయాల్లో బ్రాహ్మణ, కాపు, శెట్టిబలిజ, అగ్నికుల క్షత్రియ, కంసాలి, మాదిగ సామాజిక వర్గాలు తమ తమ విధులు నిర్వహిస్తూ మే13న మొదలైన జాతర మహోత్సవాలు, 25 నుంచి ఆలయం వద్ద ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 9వ తేది రాత్రి జరిగే జాతరకు సుమారు పది లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ఆలయం వద్ద భారీ విద్యుత్ దీపాలంకరణలతో పాటు ఆలయ పరిధి నాలుగు గ్రామాల్లోనూ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు.





ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాలంకరణ